లోతట్టు ప్రాంతాలకు ప్రజలు వెళ్లొద్దు

నారాయణపేట అదనపు కలెక్టర్ అశోక్

వరద నీటిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అశోక్

మక్తల్, సెప్టెంబర్ 1: రాష్ట్ర వ్యాప్తంగా భారీగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల లోకి ప్రజలను , రైతులని వెళ్లనీయరాదని నారాయణపేట జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ అన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆదివారం ఉదయం మక్తల్ మండలంలో రెవెన్యూ కలెక్టర్ పర్యటించారు. నేరడిగం వాగును మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డితో కలిసి పరిశీలించారు. అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు మక్తల్ మండలంలో ప్రత్యేకంగా పోలీస్ బృందం పర్యటించాలని, ఎప్పటికప్పుడు పరిస్థితులను తమకు తెలియజేయాలని సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- **ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**

రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

హన్వాడ/మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 1: రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తాండూర్–మహబూబ్‌నగర్ రహదారి భారీ వర్షానికి తెగిపోవడంతో ఆదివారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనాదారులకు ఇబ్బందులు లే కుండా రోడ్డు త్వరగా చేపట్టాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మండలఅధ్యక్షుడు మహేందర్ తదిత రులు ఉన్నారు. కాగా పాలమూరులో వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే చెప్పారు.కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, ఆర్డీవో నవీన్‌తో కలిసి పరిశీలించారు.

చర్లపల్లి వద్ద వరదను పరిశీలించిన ఎస్పీ

ఉధృతిని పరిశీలిస్తున్న ఎస్పీ జానకి

జడ్చర్ల, సెప్టెంబర్ 1: జడ్చర్ల మండలంలోని చెరువులు, అలుగులు పారుతున్నాయి. చర్లపల్లి రోడ్డు డౌన్ వద్ద నడుము లోతున నీళ్లు పారుతుండడంతో ఎస్పీ జానకి పరిస్థితులను పరిశీలించారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా చర్లపల్లి గ్రామం దగ్గర జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఎస్పీ జానకిని కలిసి వరద పరిస్థితిపై చర్చించారు.

వరద నీరు నిలవకుండా చూడాలి

మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

వార్డులో నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

మక్తల్, సెప్టెంబర్ 1: రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు మక్తల్ మున్సిపాలిటీలోని ఏ వార్డులోనూ వరద నీరు నిలవకుండా చూడాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదేశించారు. మక్తల్‌లోని ఏడో వార్డులో వర్షం నీరు భారీగా నిలిచిపోవడంతో కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీంతో ఆదివారం ఉదయం శ్రీరామనగర్ కాలనీ లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు.

బ్రిక్స్‌దేశాల సదస్సుకు మరికల్ న్యాయవాది

మరికల్, సెప్టెంబర్ 1: సౌత్‌ఆఫ్రికా బిక్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 3 నుంచి 6వరకు దక్షిణాఫ్రికాలోని హన్స్‌బర్గ్‌లో నిర్వహించే బ్రిక్స్ దేశాల విద్యా సదస్సుకు మరికల్‌కు చెందిన న్యాయవాది అయ్యప్ప ఎంపికైనట్లు తెలిపారు. సాంస్కృతిక, ఆర్థిక, విద్య, వైజ్ఞానిక, నూతన ఆవిష్కరణలపై చర్చలు జరుగుతాయన్నారు.

చెరువు కట్టలను పటిష్టం చేస్తాం

జడ్చర్లలోని వర్షపునీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, సెప్టెంబర్ 1: జడ్చర్ల నియోజకవర్గంలోని అన్ని చెరువులను గుర్తించి వాటి యొక్క ఎఫ్‌టిఎల్‌లను నిర్ధారించి చెరువు కట్టలను పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకోవాలని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉదయం జడ్చర్ల లోని పద్మావతికాలనీ, శాంతినగర్, శివాజీనగర్, జడ్చర్లలోని వెంకట్‌రెడ్డి కాలనీలలోని లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. తంగెళ్లపల్లికి వెళ్లే రోడ్డుపై వర్షపు నీళ్లు పారుతుండటంతో అక్కడికి వెళ్లి ఈత కొడుతూ చేపలుపట్టే వారి దగ్గరకు వెళ్లి నీటి ప్రవాహాన్ని పరిశీలించారు.

చెరువులు నిండడం ఆనందదాయకం

పూజలు చేస్తున్న సత్తూర్ బస్వరాజ్‌గౌడ్

భూత్పూర్, సెప్టెంబర్ 1 : వర్షాలకు చెరువులు నిండడం ఆనందదాయకమని మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్ అన్నారు. ఊరకుంట చెరువు 2022 తర్వాత అలుగు పారడం సంతోషమని అన్నారు. అలుగువద్ద పూజలు చేశారు. కార్యక్రమంలో అశోక్‌గౌడ్, తిరుపతయ్య, మల్లేష్, జహంగీర్, బాలస్వామి, అంజి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

FARM PLOTS SALE

★బాలానగర్ జడ్చర్ల బెంగళూరు హైవేకి గజం: 3,999/- శ్రీగంధం చెట్లతో & యాచారం సాగర్ హైవే గజం: 4,999/- ప్రూట్ ప్లాంటేషన్‌తో ఫార్మాసిటీ, RRRకి దగ్గరలో ప్లాట్లు కలవు. స్పాట్ రిజి॥ 7780483434.

NT-332573

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

నవాబ్‌పేట, మహబూబ్‌నగర్ ప్రధాన రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు

ఇబ్రహీంబాద్ వద్ద తెగిపోయిన తాండూర్, మహబూబ్‌నగర్ ప్రధాన రోడ్డు

గంగర్లపహాడ్ దగ్గర తాత్కాలిక రోడ్డు తెగి పోవడంతో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు.

వర్ష బీభత్సం

మహబూబ్‌నగర్‌లో ఎల్లమ్మ ఆలయంలోకి చేరిన వాన నీరు

- *పాలమూరులో స్తంభించిన జనజీవనం*
- *పగిడిమర్రి వాగులో కొట్టుకుపోయిన గ్రామస్తుడు*
- *తాండూర్, మహబూబ్‌నగర్ రాకపోకలు బంద్*
- *ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు*
- *నవాబ్‌పేట, మహబూబ్‌నగర్ రాకపోకలకు అంతరాయం*

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 1: ఎడతెరిపిలేని వార్షానికి పాలమూరు పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై వరద నీరు చేరి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొన్నిచోట్ల విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మున్సిపాలిటీ పరిధిలోని లోతట్టు ప్రాంతాలు కురిహినిషెట్టి కాలనీ, లక్ష్మీనగర్, మర్లు, రామయ్యబౌలి, జ్జీవన్‌రాంనగర్, అంబేద్కర్ నగర్, పాతపాలమూరు, గోల్‌మజీద్, తెలుగు గేరి, దళితవాడ, ఎర్రకుంట, వీరన్నపేట, శివశక్తినగర్ తదితర ప్రాంతాల్లో వరద ఉధృతితో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెద్దచెరువు, ఎర్రకుంట కింద కాలనీలు ముంపునకు గురయ్యాయి. పెద్ద చెరువు అలుగు నీరంతా బీకేరెడ్డి కాలనీ, రామయ్యబౌళి ప్రాంతాలకు చేరాయి. ఎర్రకుంట దిగువన ఉన్న గణేశ్ నగర్‌లోని ఇండ్లు, రహదారుల్లోకి నీళ్లు చేరాయి. బైపాస్ రహదారిలో పెద్ద ఎత్తున నీళ్లు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హౌజింగ్ బోర్డు నుంచి ఎదిర వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్డు పూర్తిగా జలమయమై, రాకపోకలు నిలిచిపోయాయి. పీర్లబాయి ఏరియా లోతట్టు ప్రాంతాల్లోని ఇండ్లలోకి నీళ్లు చేరాయి. కొందరు నీళ్లల్లో చిక్కుకుపోవడంతో పోలీసులు వారిని కాపాడారు. జెడ్పీ మినీ మైదానం పూర్తిగా నిండి, ఎల్లమ్మ గుడిలోకి వరద నీరు చేరింది.

మరో రెండ్రోజులు వర్షం

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 1:మహ్మదాబాద్ మండలంలో ఆదివారం అత్యధికంగా 123.0మి.మీ, బాలానగర్ మండలంలో అత్యల్పంగా 17.3మీ.మీ వర్షపాతం నమోదైంది. జిల్లా కేంద్రంలోని శ్రీనివాసకాలనీలో రోడ్డు తెగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పరిశీలించారు.

మహబూబ్‌నగర్ రూరల్‌లో..

పాలమూరు, సెప్టెంబర్ 1: మండలంలోని ధర్మాపూర్, కోడూరు, ఇప్పలపల్లి, గాజులపేట, జమిస్తాపూర్, చౌదర్పల్లి గ్రామాల్లోని చెరువులు, కుంటలు అలుగు పారుతున్నాయి. జమిస్తాపూర్‌లో భారీవర్షానికి ఎండి.సలీం నివాసం కుప్పకూలింది. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ రాంచంద్రయ్య పరిశీలించి వివరాలు సేకరించారు.

జనజీవనం అతలాకుతలం

ఊట్కూర్, సెప్టెంబర్ 1: కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాలకు ఎగువ నుంచి వరదనీరు చేరడంతో దాదాపు వెయ్యి ఎకరాలకు సాగునీరందించే సామర్థ్యం కలిగి ఉన్న ఊట్కూర్ పెద్ద చెరువు శనివారం అర్ధరాత్రి నుంచి మత్తడి దుంకుతోంది. వంతెన వద్ద ఎస్సై కృష్ణంరాజు ఆధ్వర్యంలో పోలీసులను నియమించారు. పగిడిమర్రి శివారులో వంతెనపై వరద ఉధృతిని దాటుకుంటూ వెళ్లిన శ్రీనివాస్‌రెడ్డి అనే మతి స్థిమితం లేనివ్యక్తి నీటిలో కొట్టుకుపోయి, కొద్దిదూరంలో చెట్టు కొమ్మను పట్టుకోగా, స్థానికులు తాళ్లసాయంతో సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.

నవాబ్‌పేటలో 11.2 సెం.మీ మీటర్లు

నవాబ్‌పేట, సెప్టెంబర్1: మండలంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు వర్షం దంచి కొట్టడంతో నోటిఫైడ్ చెరువులు, కుంటలు నిండుకుండల్లా మారి అలుగులు పారుతున్నాయి. అర్ధరాత్రి నుంచి భారీ వర్షం కురవడంతో పంట పొలాలు నీటమునిగి చెరువులను తలపించాయి. మూడేండ్ల తర్వాత చెరువులన్నీ నిండటంతో అన్నదాతల ముఖాల్లో ఆనందం కన్పిస్తోంది. యన్మన్‌గండ్ల పెద్ద చెరువు, అమ్మాపూర్ చెరువు, కేశవరావుపల్లి చెరువు, గురుకుంట సోమసముద్రం, ఇప్పటూర్ లెంకలచెరువు, పోమాల చిన్న, పెద్దచెరువులు పూర్తి స్థాయిలో నిండి అలుగులు పారుతున్నాయి. తాళ్ల వాగు రోడ్డుపై నుంచి వరద నీరు ప్రవహించడంతో నవాబ్‌పేట, మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి రాకపోకలు నిలిచిపోయాయి. తాసీల్దార్ నాన్యానాయక్, ఎంపీడీవో జయరాంనాయక్, స్థానిక పోలీసులు తాళ్లవాగు వద్ద ప్రత్యేకంగా జేసీబీ, ఇతర వాహనాలను ఏర్పాటు చేసి ప్రయాణికులను దాటించారు. మల్లారెడ్డిపల్లి వద్ద బీటీ రోడ్డు మళ్లీ తెగిపోవడంతో అక్కడ రాకపోకలు నిలిచిపోయాయి.

భారీ వర్షానికి తెగిన రోడ్డు

హన్వాడ, సెప్టెంబర్ 1: రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు, కుంటలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నారు. శనివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి తాండూర్, మహబూబ్‌నగర్ ప్రధాన రహదారి ఇబ్రహీంబాద్, మహ్మదాబాద్ గ్రామాలమధ్యలోని వాగుపై వేసిన రోడ్డు నీటి ప్రవాహానికి తెగిపోవడంతో వాహనాలు నిలిచిపోయాయి. తెల్లవారుజాము 3గంటల నుంచి తాండూర్ నుంచి వచ్చే వాహనాలు మహ్మదాబాద్, నంచర్ల గేటు దగ్గర మహబూబ్‌నగర్ నుంచి వచ్చే వాహనాలు కోయిల్‌కొండ ఎక్స్‌రోడ్డు దగ్గర నిలిపివేశారు. ఇబ్రహీంబాద్ సమీపంలో తెగిన తాండూర్, మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిని ఆదివారం డీఆర్‌డీఏ పీడీ నర్సిములు, తాసీల్దార్ కిష్టానాయక్ ఇతర అకారులు రోడ్డును పరిశీలించారు. మండలంలో 10ఇండ్లు నేలమట్టం, 10వేల ఎకరాల్లో వరిపంట నష్టం జరిగిందని అధికారులు తెలిపారు.

నిండిన చెరువులు..

ధన్వాడ, సెప్టెంబర్ 1: కురుస్తున్న వర్షాలకు ధన్వాడ, గున్ముక్ల, ఎంనోనిపల్లి, కంసాన్‌పల్లి, కొండాపూర్, కిష్టాపూర్, హన్‌మాన్‌పల్లి, చర్లపల్లి, రామకిష్టయ్యపల్లి, మందిపల్లి చెరువులు పూర్తిగా నిండాయి.

నీట మునిగిన వరి పంటలు

మహ్మదాబాద్, సెప్టెంబర్ 1: దంచి కొడుతున్న వానలతో రైతులు వేసుకున్న వరి పంటలు నీటమునిగాయి. కురుస్తున్న భారీ వర్షాలతో బ్రహ్మణి చెరువు అలుగుపారింది. గంగర్లపహాడ్ దగ్గర రోడ్డు తెగిపోవడంతో మహబూబ్‌నగర్ వైపు రాకపోకలు నిలిచిపోయాయి. తాండూర్ నుంచి వచ్చే వాహనాలను నంచర్లగేట్ మీదుగా నవాబ్‌పేట్ మీదుగా మహబూబ్‌నగర్ వెళ్తున్నాయి.

నిండిన సాలార్‌నగర్

గండీడ్, సెప్టెంబర్ 1: మండలంలోని సాలార్‌నగర్ ప్రాజెక్టు ఆదివారం అలుగు పారుతున్నది. ప్రాజెక్టు కింద దాదాపు వెయ్యి ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రాజెక్టు వర్షాలతో నిండుకుండలా మారండంతో అటు మత్స్యకారులు, ఇటు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని వెన్నాచేడ్ పెద్ద చెరువులోకి కూడా భారీగా వరద నీరు వచ్చి చేరుతున్నది. మండల పరిధిలోని పగిడ్యాల్ గుంతల నీలమ్మ, కర్రె వెంకటయ్యకు చెందిన రెండు మట్టిమిద్దెలు కూలిపోయాయి. ఈ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవంతో ఎలాంటి నష్టం వాటిల్లలేదు.

కౌకుంట్లలో 88.8..

దేవరకద్ర రూరల్ (కౌకుంట్ల), సెప్టెంబర్ 1 ః కురుస్తున్న భారీవర్షాలకు కాల్వలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోగా, పంటపొలాలు మునిగి తీవ్రనష్టాన్ని కలిగిస్తున్నాయి. కౌకుంట్ల చింతకుంట మండలాల్లో వేలఎకరాలాల్లో పంటలు జలమయమయ్యాయి. కౌకుంట్లమండలంలో 88.8శాతం, చింతకుంటలలో 85.2శాతం వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

వంతెన మంజూరు చేయాలి

మూసాపేట, సెప్టెంబర్ 1 : మండలంలోని పొల్కంపల్లి–కప్పెట గ్రామాల మధ్య వంతెన మంజూరు చేయాలని మాజీ జెడ్పీటీసీ రామన్‌గౌడ్ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

నిలిచిన రాకపోకలు

మరికల్, సెప్టెంబర్ 1: మండల కేంద్రం జలమయంగా మారింది. శనివారం నుంచి ఆదివారం వరకు అంతర్రాష్ట్ర రహదారిపై నీరు ప్రవహిస్తూనే ఉంది. ఆదివారం నీటి ఉధృతి పెరగడంలో నారాయణపేట అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, తాసీల్దార్ జమీల్, ఎంపీడీవో పావని పరిస్థితిని సమీక్షించారు. కన్‌కన్ చెరువు అలుగు పారడం, ధర్మన్నకుంటకు నీరు ఎక్కువగా రావడంతో కిష్టంపల్లికి వెళ్లే రోడ్డు జలమయమై, కాలనీ మొత్తం నీట మునిగింది. మరికల్–ఆత్మకూర్, మరికల్–కన్మనూర్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. మండల కేంద్రంలోని మద్వార్ రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డుపై భారీగా వరద నీరు ప్రవహించింది. మాజీ జెడ్పీటీసీ గౌని సురేఖ రెడ్డి, మాజీ ర్పంచ్ కస్పే గోవర్ధన్, సీఐ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో రహదారిపై రాకపోకలకు సహకరించారు.

బాలానగర్ మండలంలో..

బాలానగర్, సెప్టెంబర్ 1: బాలానగర్, రాజాపూర్ మండలాల్లోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. బూర్గుల నుంచి మోతీగణపూర్ గ్రామానికి వెళ్లే రహదారిపై కల్వర్టు వద్ద భారీగా వరదనీరు రహదారిపై ప్రవహిస్తుండడంతో పోలీసులు కల్వర్టు వద్ద ముళ్ల కంప ఏర్పాటు చేసి రాకపోకలను నిలిపివేశారు. బాలానగర్ సమీపంలోని ఏకలవ్య గురుకులం వద్ద వరదనీరు రహదారిపై ప్రవహిస్తుండటంతో వాహనదారులు ఇబ్బందిప డ్డారు. రాజాపూర్ మండలం కుచ్చరకల్ రహదారిపై అలుగునీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిపివేశారు.

ఇండ్లలోకి చేరిన వర్షపునీరు

జడ్చర్ల, సెప్టెంబర్ 1: జడ్చర్ల మండలంలో రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జడ్చర్లలోని శివాజీనగర్, శాంతినగర్ కాలనీల్లో ఇండ్లలోకి నీళ్లు చేరాయి. ఊరచెరువు అలుగు పారుతుండటంతో పద్మావతి కాలనీలోనికి మోకాళ్ల ఎత్తులో పారాయి.

భారీగా పంట నష్టం..

మిడ్జిల్, సెప్టెంబర్ 1: భారీ వర్షాలకు మండలంలో పంట పొలాలు పూర్తిగా నీటమునిగాయి. వరి, పత్తి, మొక్కజొన్న పంటలు పూర్తిగా చేతికి రాకుండాపోయాయి.

దామరగిద్ద మండలంలో..

దామరగిద్ద, సెప్టెంబర్ 1: మండలంలో కూలిపోయిన ఇండ్లను ఆదివారం తాసీల్దార్ జయరాములు, ఆర్ఐ రాములు పరిశీలించారు. కోడిగంటి నర్సప్ప, విఠలాపూర్‌లో మాల లక్ష్మమ్మతో పాటు ఆరుఇండ్లు కూలిపోయాయి. లక్ష్మమ్మకు పాఠశాలలో వసతి కల్పించారు.

రాకపోకలు బంద్

మక్తల్, సెప్టెంబర్ 1: మండలంలోని రుద్రసముద్రం , కర్ని గ్రామాల చెరువులు అలుగు పారుతున్నాయి. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మక్తల్–అనుగొండ దారిలో కర్నె చెరువు అలుగు పారుతున్నది. దీనివల్ల ఆ దారిలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గద్వాలకు వెళ్లే రహదారిలో రుద్రసముద్రం చెరువు అలుగుపారుతుండడంతో రాకపోకలు నిలిచాయి. అలాగే మంతన్‌గౌడ్ నర్వ మండలాలకు కూడా రాకపోకలు నిలిచిపోయాయి.

అలుగు పారుతున్న సాలార్‌నగర్ ప్రాజెక్టు

ఉధృతంగా ప్రవహిస్తున్న కౌకుంట్ల వాగు

భారీ వర్షాలకు అలుగు పారుతున్న మంథన్ గౌడ్ చెరువు

మక్తల్ : పగిడిమర్రి వాగులో కొట్టుకుపోయిన వ్యక్తి తాడుతో దరికి చేరుతున్న దృశ్యం

పొల్కంపల్లి–కప్పెట రాకపోకలు నిలిచిపోవడంతో ప్రమాదసూచిక ఏర్పాటు

పాలమూరు : లక్ష్మీనగర్‌కాలనీలో మండపంలోని నీటిని తోడుతున్న బాలుడు

దుందుభీవాగు ఉధృత్తంగా ప్రవహిస్తున్న దృశ్యం

కొత్త చెరువు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

జడ్చర్ల : పోలేపల్లి గ్రామంలో కూలిన ఇళ్లు

మన్నెవాగులో నిలిచిన రాకపోకలు

మరికల్‌లో నీటిని పరిశీలిస్తున్న అధికారులు

పాలమూరులోని గణేశ్‌నగర్ వద్ద నీటి ఉధృతి

వర్షాలకు జమిస్తాపూర్‌లో పడిపోయిన ఇంటి గోడ